Dr. Sravan Kumar Dasoju
MLC
Telangana Legislative Council

H. No: 46, Aditya Empress Park
Shaikpet, Hyderabad - 500008
Mobile No: +91 9885039384

తేదీ: నవంబర్, 4, 2026

గౌరవనీయులు శ్రీ పొన్నం ప్రభాకర్ గారు

వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రివర్యులు

తెలంగాణ ప్రభుత్వం, డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయం, హైదరాబాద్

విషయం: బీసీ ఆత్మగౌరవ భవనాల నిర్మాణం, నిర్వహణపై జారీ చేసిన బీసీ వ్యతిరేక, ఫ్యూడల్ ఆధిపత్య అహంకార, రాజ్యాంగ విరుద్ధ జీ.ఓ.ఎంఎస్.నెం.14 ను తక్షణమే రద్దు చేయాలని, భవనాల నిర్వహణ అధికారాన్ని బీసీ కుల సమాజాలకే అప్పగించాలని కోరుతూ ప్రతినిధి పత్రం.

సూచిక:

1. *జీ.ఓ.ఎంఎస్.నెం.14, వెనుకబడిన తరగతుల సంక్షేమ (డి) శాఖ, తేదీ 29.10.2026.*
2. *జీ.ఓ.ఎంఎస్.నెం.13, వెనుకబడిన తరగతుల సంక్షేమ (డి) శాఖ, తేదీ 13.10.2026 (పై జీ.ఓ. ద్వారా రద్దు చేయబడినది).*
3. *జీ.ఓ.ఎంఎస్.నెం.09 (తేదీ 22.12.2014), నెం.23 (తేదీ 29.12.2017), నెం.19 (తేదీ 14.08.2018), నెం.20 (తేదీ 10.09.2018), వెనుకబడిన తరగతుల సంక్షేమ (బి) శాఖ; జీ.ఓ.ఎంఎస్.నెం.189, రెవెన్యూ (అసైన్‌మెంట్-II) శాఖ, తేదీ 05.09.2018.*
4. *కమిషనర్, వెనుకబడిన తరగతుల సంక్షేమం, మెమో నెం.B/4235/2018-3, తేదీ 21.04.2022 (ప్రభుత్వ నిర్మాణం ఎంచుకున్న ఉమ్మడి సంఘాలకు సూచనలు).*
5. *ప్రభుత్వ మెమో నెం.3676/D/2021, వెనుకబడిన తరగతుల సంక్షేమ (డి) శాఖ, తేదీ 07.09.2022.*
6. *కమిషనర్, వెనుకబడిన తరగతుల సంక్షేమం, మెమో నెం.B/4235/2018-24, తేదీ 07.09.2022 (ముదిరాజ్ డెవలప్‌మెంట్ ట్రస్టుకు నిర్మాణ, నిర్వహణ బాధ్యతల అప్పగింత).*

గౌరవనీయులైన మంత్రివర్యులు శ్రీ పొన్నం ప్రభాకర్ గారికి, నమస్కారం.

బీసీ ఆత్మగౌరవ భవనాలపై సర్కారు పెత్తనం అసమంజసమైనది. బీసీ ఆత్మగౌరవ భవనాలు కేవలం ఇటుకలు, సిమెంటుతో కట్టిన కట్టడాలు కావు. శతాబ్దాలుగా అవమానాలు, అణచివేతలు ఎదుర్కొన్న వృత్తి కులాలకు రాజధాని నగరంలో సొంత గూడు, సొంత గొంతు ఉండాలనే ఆకాంక్షకు అవి ప్రతీకలు. ఈ ఆకాంక్షను నెరవేర్చడానికే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు గారి ఆలోచనలతో ఈ ఆత్మ గౌరవాల భవనాల పథకం పుట్టింది.

స్వరాష్ట్ర తెలంగాణలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు గారి నాయకత్వంలోని ప్రభుత్వం రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో 87 ఎకరాల 30 గుంటల, Rs. 4000 కోట్ల విలువైన భూమిని కేటాయించి, భవన నిర్మాణం కోసం రూ.95.25 కోట్లు మంజూరు చేసి, 41 బీసీ, ఇతర కులాలకు ఆత్మగౌరవ భవనాలను మంజూరు చేసింది. **ఆ నిర్ణయం వెనుక గౌరవ శ్రీ కేసీఆర్ గారి ఏకైక లక్ష్యం బీసీ కులాల సాధికారత, వారి స్వయంపాలన, ఆత్మగౌరవ పరిరక్షణ. తమ భవనాన్ని తామే నిర్వహించుకుంటూ, తమ సంస్కృతిని, తమ మహనీయుల స్మృతిని తామే కాపాడుకునే వేదికను ఆ పథకం బీసీలకు అందించింది.**

కానీ, దురదృష్టం, మీ ప్రభుత్వం , కేసీఆర్ గారి మహోన్నత స్ఫూర్తిని ధ్వంసం చేస్తోంది. బీసీ సమాజాలకు స్వయంపాలన కోసం అందించిన భవనాలను జీ.ఓ.14 ద్వారా సర్కారు గుప్పిట్లోకి లాక్కుంటోంది. ఇది కేవలం ఒక పరిపాలనా ఉత్తర్వు కాదు; బీసీల స్వయంపాలనపై (Self-Rule), ఆత్మగౌరవంపై (Self-Respect) జరుగుతున్న ఆధిపత్య వర్గాల పాశవిక దాడి.

అమలులో "కొన్ని అడ్డంకులు" ఎదురయ్యాయని జీ.ఓ.ఎంఎస్.నెం.14 స్వయంగా అంగీకరించింది. ఆ అడ్డంకులను తొలగించాల్సిన ప్రభుత్వం, దానికి బదులుగా భవనాలపై పూర్తి నియంత్రణను తన చేతుల్లోకి తీసుకుంది. కుల సంఘాలను, వారి నాయకులను, భవన నిర్వహణ కమిటీ సభ్యులను “నిర్వాహకులుగా” కాకుండా కేవలం "కాపలాదారులుగా" మార్చింది. ఇది ఆత్మగౌరవ భవనాల జీ.ఓ. కాదు, బీసీల ఆత్మగౌరవాన్ని అదుపులో పెట్టే ఫ్యూడల్, ఆధిపత్య అహంకార బీసీ వ్యతిరేక, రాజ్యాంగ విరుద్ధ జీ.ఓ.

అక్టోబర్ 27న జరిగిన సమీక్షలో 38 ఆత్మగౌరవ భవనాల ఉత్తర్వులను వేగవంతం చేయాలని మీరే అధికారులను ఆదేశించారు. రెండు రోజుల్లో వెలువడిన ఈ జీ.ఓ. మాత్రం వేగాన్ని కాదు, అక్రమ పెత్తనాన్ని తెచ్చింది. పైగా 13.10.2026 న ఇచ్చిన జీ.ఓ.ఎంఎస్.నెం.13 ను కేవలం 16 రోజుల్లోనే రద్దు చేయడం, ఈ విషయంలో ప్రభుత్వానికి స్పష్టమైన విధానం లేదని, కుల సంఘాలను సంప్రదించకుండానే నిర్ణయాలు తీసుకుంటోందని తేటతెల్లం చేస్తోంది.

1. కేసీఆర్ బీసీ కులాలకు అందించిన సాధికారత పై ఆధిపత్య అహంకార అణచివేత:

BRS గత ప్రభుత్వం, బీసీ కులాలకే భవనాల నిర్మాణం, నిర్వహణ బాధ్యత అప్పగిస్తే, ఇప్పుడు మీరు GO 14 ద్వారా, ఆ విధానాన్ని తలకిందులు చేశారు.

- **సంప్రదింపులు:** 08.11.2021, 09.11.2021 తేదీల్లో నాటి బీసీ సంక్షేమ మంత్రి శ్రీ గంగుల కమలాకర్ గారి అధ్యక్షతన 41 కులాల రిజిస్టర్డ్ సంఘాలు, ట్రస్టులతో సమావేశాలు జరిగాయి. ప్రతి కులం తన సంఘాలన్నింటినీ కలుపుకుని ఒకే ఉమ్మడి ట్రస్టు లేదా సంఘాన్ని నమోదు చేసుకోవాలని, ఆ ఉమ్మడి సంస్థకే భూమి అప్పగిస్తామని ప్రభుత్వం చెప్పింది. 18.02.2022 న 15 ఉమ్మడి సంఘాలతో మళ్లీ సమావేశం జరిగింది.
- **ఎంపిక స్వేచ్ఛ:** 21.04.2022 నాటి మెమో ప్రకారం 41 లో 15 కులాల సంఘాలు ఉమ్మడి సంఘాలుగా గుర్తింపు పొందాయి. వాటిలో 9 సంఘాలు సొంత నిర్మాణాన్ని, 6 సంఘాలు ప్రభుత్వ నిర్మాణాన్ని ఎంచుకున్నాయి. ప్రభుత్వ నిర్మాణం ఎంచుకున్న సంఘాలకు కూడా టీఎస్ఈడబ్ల్యూఐడీసీ తో ఎంఓయూ ద్వారా భాగస్వామ్యం, అదనపు నిధులతో అదనపు బ్లాకులు చేర్చుకునే అవకాశం కల్పించారు.
- **అప్పగింత:** 07.09.2022 నాటి కమిషనర్ మెమో ప్రకారం, ముదిరాజ్ సమాజానికి కోకాపేటలో 5 ఎకరాలు, రూ.5 కోట్లు మంజూరు కాగా, ఆత్మగౌరవ భవన "నిర్మాణం, నిర్వహణ" బాధ్యతను ముదిరాజ్ డెవలప్‌మెంట్ ట్రస్టుకే అప్పగిస్తూ ప్రభుత్వం మెమో నెం.3676/D/2021 ద్వారా ఉత్తర్వులు ఇచ్చింది. ప్రభుత్వ నిధులకు అదనంగా సొంత వనరులు సమీకరించుకోవచ్చని కూడా అదే మెమో చెప్పింది.

2. బిఆర్ఎస్ ప్రభుత్వం Vs కాంగ్రెస్ ప్రభుత్వాల మధ్య తేడా:

అంశం	2022 నాటి కేసీఆర్ విధానం	జీ.ఓ.14 (29.10.2026)
సంప్రదింపులు	మంత్రి అధ్యక్షతన 41 కులాల సంఘాలతో సమావేశాలు	కమిషనర్ ప్రతిపాదననే ఆధారంగా చూపింది; సంఘాలతో సమావేశాల ప్రస్తావన లేదు
నిర్వహణ	ఆయా కులాల ఉమ్మడి ట్రస్టుకు అప్పగింత	మంత్రి అధ్యక్షతన ఎంపిక కమిటీ నియమించే కమిటీ; 8 మందిలో 3 అధికారులు; కేవలం "కస్టోడియన్" హోదా
నిర్మాణం	ఆయా కులాలా ట్రస్టులే ఎంచుకునే స్వాతంత్ర్యం: 9 కులాలు సొంత నిర్మాణం, 6 కులాలు ప్రభుత్వ నిర్మాణం	ప్రభుత్వ సంస్థలకు మాత్రమే
ట్రస్టు పాత్ర	ఇంజనీరింగ్ సంస్థతో ఎంఓయూ ద్వారా భాగస్వామ్యం	నిర్వహణలో కేవలం "సహకారం"
ప్రభుత్వ నిధులు	87 ఎకరాల 30 గుంటలు, రూ.95.25 కోట్లు స్పష్టంగా పేర్కొన్నారు	మొత్తం ప్రస్తావన లేదు; "నిధుల లభ్యత"కు లోబడి మాత్రమే
భవనకమిటీ నిధులు	అదనపు వనరులు సమీకరించుకోవడానికి వెసులుబాటు	సొంత నిధులతో కట్టిన భవనాలకూ ఇవే మార్గదర్శకాలు; అనవసర ప్రభుత్వ పెత్తనం, నెలవారీ ఫోటో నివేదికలు,

21.04.2022 మెమోలో సమావేశాలకు అనుమతి, భూమిపై ఆదాయం వంటి అంశాలపై ఉన్న సూచనలు ప్రభుత్వ నిర్మాణాన్ని స్వయంగా ఎంచుకున్న 6 సంఘాలకు మాత్రమే ఇచ్చినవి. కానీ జీ.ఓ.14 మాత్రం ప్రభుత్వ నియంత్రణను అన్ని భవనాలకు, నిర్వహణ దశ మొత్తానికి, ఆఖరికి సొంత నిధులతో కట్టిన భవనాలకు కూడా విస్తరించింది. భూమి అమ్మకం, తనఖాపై నిషేధాన్ని నేను వ్యతిరేకించడం లేదు; కానీ బీసీల చేతుల్లో ఉన్న భవన నిర్వహణ అధికారాన్ని లాక్కోవడం బీసీ కులాలను అవమానించి, వారిని అణచివేతకు గురిచేయడం పూర్తిగా వ్యతిరేకిస్తున్నాము.

మూడేళ్లుగా అధికారంలో ఉన్న మీ ప్రభుత్వం ఆ 41 భవనాల్లో ఎన్ని పూర్తి చేసింది? మంజూరైన రూ.95.25 కోట్లలో ఎంత విడుదలైంది? ఈ లెక్క చెప్పకుండా కమిటీల నియామకంపై మాత్రం అత్యుత్సాహం చూపడం ఎవరి కోసం?

3. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ నుంచి GO 14 నిరంకుశ డిక్టేషన్ దాకా

2023 నవంబర్ 10న కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో బీసీలకు అధికారంలో న్యాయమైన వాటా ఇస్తామన్న కాంగ్రెస్, మూడేళ్లుగా ఆ హామీలను అమలు చేయకుండా, పెద్ద మోసానికి పాల్పడింది. ఆరు నెలల్లో 42% స్థానిక రిజర్వేషన్లు అన్నారు; బిల్లులు, ఆర్డినెన్సులు, ఢిల్లీ ధర్నాలతో కాలయాపన చేశారు, వార్తా కథనాల ప్రకారం పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు దక్కింది దాదాపు 17% స్థానాలే. ఏటా రూ.20,000 కోట్లు (ఐదేళ్లలో రూ.1 లక్ష కోట్లు) హామీకి బడ్జెట్ దరిదాపుల్లో లేదు. చట్టబద్ధతతో ఫూలే బీసీ సబ్‌ప్లాన్ ఎక్కడ? ఎంబీసీ హామీలు ఎక్కడ? కుల కార్పొరేషన్లకు నిధులు ఇప్పటికీ "త్వరలో" అనే మాటకే పరిమితం.

బీసీ భవనాల విషయంలో ఈ ద్రోహం మరింత స్పష్టం. ప్రతి జిల్లా కేంద్రంలో రూ.50 కోట్లతో కన్వెన్షన్ హాల్, స్టడీ సర్కిల్, గ్రంథాలయం, ప్రెస్ క్లబ్‌తో ప్రొ. జయశంకర్ బీసీ ఐక్యత భవనాలు కడతామన్నారు; ఏ జిల్లాలో ఆ భవనం నిలబడింది? కొత్తవి కట్టకపోగా, ఉన్న ఆత్మగౌరవ భవనాలనే జీ.ఓ.14 ద్వారా లాక్కుంటున్నారు. "ఐక్యత భవనాలు" కడతామన్న ప్రభుత్వమే అన్ని బీసీ కులాలు కలిసి సమావేశమయ్యే అవకాశాన్ని నిషేధించడం ద్వంద్వ నీతికి పరాకాష్ఠ. బీసీ కార్పొరేషన్లు, ఫెడరేషన్ల కింద నమోదైన సొసైటీలకు ఎన్నికలు నిర్వహించి, ఒక్కో సొసైటీకి రూ.10 లక్షలు ఇస్తామన్న అదే ప్రభుత్వం, ఇప్పుడు ఆత్మగౌరవ భవనాల కమిటీలను ఎన్నికలు లేకుండా మంత్రి నామినేషన్లతో నింపుతోంది.

***కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీలు నెరవేర్చకపోవడం బీసీలకు జరిగిన మొదటి ద్రోహమైతే, దానిపై భూస్వామ్య జీ.ఓ.14 తో వారి స్వయంపాలనను, స్వయం సాధికారతను లాక్కోవడం రెండో ద్రోహం.* రాజ్యాధికారంలో వాటా ఇస్తామన్న మీ ప్రభుత్వం, ఆఖరికి వారి సొంత భవనాల నిర్వహణ అధికారాన్ని కూడా గుంజుకుంటోంది. ఓట్ల కోసం కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్, అధికారంలోకి వచ్చాక బీసీలపై మీ దొరల తరహా నియంతృత్వ డిక్టేషన్: ఇదే మీ ప్రభుత్వ నిజ స్వరూపం.**

4. జీ.ఓ.14: బీసీ వ్యతిరేక, రాజ్యాంగ విరుద్ధ నిబంధనలు

జీ.ఓ.ఎంఎస్.నెం.14 అనేది ఆర్టికల్ 162, 166 కింద గవర్నర్ పేరిట జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వు మాత్రమే, **శాసనసభ ఆమోదించిన చట్టం కాదు.** కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా ప్రాథమిక హక్కులను పరిమితం చేయలేమని ***ఖరక్ సింగ్ వర్సెస్ ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం (1962), బిజో ఇమ్మాన్యుయేల్ వర్సెస్ కేరళ రాష్ట్రం (1986)*** కేసుల్లో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ***ఈ మౌలిక లోపంతో పాటు, జీ.ఓ.లోని ప్రతి కీలక నిబంధన బీసీ సాధికారతను దెబ్బతీస్తూ, రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తోంది:***

I. అంశం 2: ఎంపిక కమిటీలో సర్కారుదే పైచేయి, నియామకాలు, పదవీకాలం మంత్రి ఇష్టానుసారం (ఆర్టికల్ 14)

- **లోపం:** ఐదుగురు సభ్యుల ఎంపిక కమిటీలో మంత్రి, ముఖ్య కార్యదర్శి, ఎండీ, కమిషనర్ అనే నలుగురు ప్రభుత్వ పక్షమే; సమాజానికి ఒకే స్థానం, అదీ ప్రభుత్వం ఎంచుకునే "ప్రముఖ నాయకుడు". నిర్వహణ కమిటీ సభ్యులను, ఛైర్‌పర్సన్‌ను ఆయా కుల సమాఖ్యలు **ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకోవు, రాష్ట్ర ప్రభుత్వ మంత్రి నియమిస్తారు.** మూడేళ్ల పదవీకాలాన్ని "అవసరమైతే" ఎన్నిసార్లైనా పొడిగించవచ్చు. అర్హతలు, ప్రక్రియ, పారదర్శకత ఏదీ లేదు. భవనాలు అధికార పార్టీ అనుచరుల పునరావాస కేంద్రాలుగా మారే ప్రమాదం ఉంది.
- **రాజ్యాంగ ఉల్లంఘన:** మార్గదర్శక సూత్రాలు లేని అపరిమిత విచక్షణాధికారం **ఆర్టికల్ 14** కు విరుద్ధం. సమానత్వానికి ఏకపక్షత బద్ధ శత్రువని **ఇ.పి. రాయప్ప వర్సెస్ తమిళనాడు రాష్ట్రం (1974)** లో, స్పష్టమైన ఏకపక్షత ఉన్న నిబంధనలు చెల్లవని **శాయరా బానో వర్సెస్ భారత ప్రభుత్వం (2017)** లో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

II. అంశం 2: భవన నిర్వహణ కమిటీలో అధికారుల చొరబాటు (ఆర్టికల్ 19(1)(సి))

- **లోపం:** ఎనిమిది మంది కమిటీలో కమిషనర్, ఎండీ, కలెక్టర్ లేదా డీబీసీడబ్ల్యూఓ అనే ముగ్గురు అధికారులు ఓటు హక్కుతో సభ్యులు. పైగా కమిటీ కార్యకలాపాలను కమిషనర్, ఎండీ "పర్యవేక్షిస్తారు". ఇది స్వయం నిర్వహణ కాదు, అధికారుల పెత్తనం.

- **రాజ్యాంగ ఉల్లంఘన:** **సంఘం తన సభ్యులను తానే ఎన్నుకునే హక్కు సంఘ స్వాతంత్ర్యంలో భాగం**. బయటి వ్యక్తులను సంఘంపై రుద్దడం **ఆర్టికల్ 19(1)(సి)** ఉల్లంఘనేనని **దమయంతి నరంగ వర్సెస్ భారత ప్రభుత్వం (1971)** లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది.

III. అంశం 4 కింది గమనిక: ఆయా కులాలా ట్రస్ట్ సొంత నిధులతో కట్టిన భవనాలపైనా పెత్తనం (ఆర్టికల్ 300ఎ)

- **లోపం:** కుల సమాజాలు చందాలతో, సొంత నిధులతో నిర్మించుకున్న భవనాలకూ ఈ మార్గదర్శకాలే వర్తిస్తాయి; ప్రతి నెలా ఫోటోలతో పురోగతి నివేదిక సమర్పించాలి. ప్రభుత్వ నిధులకు అదనంగా సొంత వనరులు సమీకరించుకోమని 07.09.2022 మెమోలో ఆహ్వానించిన ప్రభుత్వమే, ఇప్పుడు ఆ నిధులతో కట్టిన భవనాలపై పెత్తనం చేస్తోంది.
- **రాజ్యాంగ ఉల్లంఘన:** చట్టబద్ధ అధికారం లేకుండా ఏ వ్యక్తి ఆస్తినీ హరించరాదని **ఆర్టికల్ 300ఎ** చెబుతోంది. ప్రజల చందాలతో నిర్మించిన ఆస్తి నిర్వహణను కార్యనిర్వాహక ఉత్తర్వుతో ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకోవడం ఆ రక్షణకు విరుద్ధం.

IV. అంశం 4, 4(ఎ): భవన నిర్మాణంలో ఆయా కులాల పాత్ర లేదు, అడుగడుగునా రెండంచెల అనుమతులు (ఆర్టికల్ 14)

- **లోపం:** నిర్మాణం టీజీఈడబ్ల్యూఐడీసీ వంటి ప్రభుత్వ సంస్థలకే ఏకస్వామ్యం; కాలపరిమితి, జవాబుదారీతనం లేదు. సంఘాలను కేవలం "సహకారం" అందించే స్థాయికి కుదించారు. 2022 లో 15 ఉమ్మడి సంఘాల్లో 9 సొంత నిర్మాణాన్ని ఎంచుకోగా, ఆ ఎంపిక అవకాశాన్నే ఈ జీ.ఓ. తొలగించింది. కొత్త నిర్మాణం, మార్పులు, ఖాళీ స్థలం, చివరకు తాత్కాలిక షామియానాకు కూడా కమిషనర్‌తో పాటు ప్రభుత్వ అనుమతి కావాలి; ప్రభుత్వం స్పందించడానికి గడువు లేదు.
- **రాజ్యాంగ ఉల్లంఘన:** గడువు, ప్రమాణాలు లేని అనుమతుల వ్యవస్థ ఏకపక్షతకు దారితీస్తుంది; ఇది **ఆర్టికల్ 14** కు విరుద్ధం.

V. అంశం 4(సి): నోటీసు లేకుండానే కమిటీ రద్దు (ఆర్టికల్ 14, 21, సహజ న్యాయం)

- **లోపం:** మార్గదర్శకాల ఉల్లంఘన పేరుతో "ఎలాంటి నోటీసు లేకుండా" కమిటీని రద్దు చేయవచ్చు. షోకాజ్ నోటీసు, వివరణకు అవకాశం, అప్పీలు ఏవీ లేవు.
- **రాజ్యాంగ ఉల్లంఘన:** వాదన వినకుండా చర్య తీసుకోరాదనే (audi alteram partem) సహజ న్యాయ సూత్రం పరిపాలనా చర్యలకూ వర్తిస్తుందని **ఎ.కె. క్రైపాక్ వర్సెస్ భారత ప్రభుత్వం (1969)**, ప్రతి ప్రక్రియ న్యాయంగా, సహేతుకంగా ఉండాలని **మేనకా గాంధీ వర్సెస్ భారత ప్రభుత్వం (1978)** తీర్పులు స్పష్టం చేశాయి.

VI. అంశం 4(సి): "ప్రభుత్వ వ్యతిరేక" కార్యకలాపాలు, రాజకీయ సమావేశాల నిషేధం (ఆర్టికల్ 19(1)(ఎ), (బి))

- **లోపం:** బీసీ సాధికారత అంటేనే రాజకీయ సాధికారత. 42% రిజర్వేషన్లు, జనగణన, స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యంపై ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రశ్నిస్తూ బీసీలు తమ సొంత భవనంలో సమావేశం పెట్టుకోలేని దుస్థితి ఇది. అధికార పార్టీ నాయకులు మాత్రం "ప్రభుత్వ కార్యక్రమాల" పేరుతో వాడుకునే అవకాశం మిగిలే ఉంది.

- **రాజ్యాంగ ఉల్లంఘన: ఆర్టికల్ 19(2), 19(3)** లోని సహేతుక పరిమితుల జాబితాలో "ప్రభుత్వ వ్యతిరేకత" అనే ఆధారమే లేదు. ప్రభుత్వాన్ని విమర్శించడం ప్రజాస్వామ్య హక్కని **కేదార్‌నాథ్ సింగ్ వర్సెస్ బిహార్ రాష్ట్రం (1962)** లో, అస్పష్ట పదాలతో వాక్ స్వాతంత్ర్యాన్ని అడ్డుకునే నిబంధనలు చెల్లవని **శ్రేయా సింఘాల్ వర్సెస్ భారత ప్రభుత్వం (2015)** లో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

VII. అంశం 4(సి): కుల సంప్రదాయాలు, మహనీయుల స్మరణపై ఆంక్షలు (ఆర్టికల్ 25, 29(1))

- **లోపం:** "మతపరమైన కార్యకలాపాలు" నిషేధమని ఒకవైపు, "కుల సంప్రదాయ సమావేశాలకు" అనుమతి అని మరోవైపు చెప్పడం పరస్పర విరుద్ధం. బీసీ కులాల సంస్కృతి కులదైవాలు, జాతరలు, ఆరాధనలతో విడదీయలేనంతగా ముడిపడి ఉంది; ఏది సంప్రదాయం, ఏది మతం అనేది అధికారుల విచక్షణకు వదిలేశారు. బీసీ మహనీయుల జయంతి, వర్ధంతులను అనుమతించినట్లే అనుమతించి, వాటిని "రాజకీయ", "ప్రభుత్వ వ్యతిరేక" నిషేధాలకు లోబడి జరపాలనడంతో, ఫూలే, పాపన్న జయంతి సభల్లో 42% రిజర్వేషన్లు, బీసీ హక్కులపై మాట్లాడినా "రాజకీయం" అనే ముద్ర వేసి అడ్డుకునే ప్రమాదం ఉంది. పైగా "ఆ కుల" నాయకులకే పరిమితం చేయడంతో, అన్ని బీసీ కులాలు కలిసి జరుపుకునే ఉమ్మడి జయంతులకు స్పష్టత లేదు.
- **రాజ్యాంగ ఉల్లంఘన: ఆర్టికల్ 25** మత స్వేచ్ఛను, **ఆర్టికల్ 29(1)** ప్రత్యేక సంస్కృతి కలిగిన ప్రతి పౌర వర్గానికి తమ సంస్కృతిని పరిరక్షించుకునే హక్కును ఇస్తున్నాయి.

VIII. అంశం 4, 4(సి): బీసీ ఐక్యతకు అడ్డుకట్ట

- **లోపం:** భవనం "ఆ కులానికే ప్రత్యేకంగా" వాడాలనే నిబంధన వల్ల అన్ని బీసీ కులాలు కలిసి నిర్వహించే ఉమ్మడి సదస్సులు, ఐక్య వేదికల సమావేశాలకు ఈ భవనాలు దూరమవుతాయి. ఇది బీసీలను కులాలవారీగా విడదీసి పాలించే విధానం.

IX. అంశం 7: ప్రభుత్వమే పక్షం, ప్రభుత్వమే న్యాయమూర్తి (ఆర్టికల్ 14, 21)

- **లోపం:** వివాదాలను కమిషనర్, ఆ తర్వాత ప్రభుత్వమే పరిష్కరిస్తుంది; స్వతంత్ర ఫిర్యాదుల వ్యవస్థ లేదు. కోర్టులకు వెళ్లాలన్నా హైదరాబాద్ కోర్టులకే అనడం జిల్లాల్లోని పేద బీసీలకు భారం.
- **రాజ్యాంగ ఉల్లంఘన: తన కేసులో తానే న్యాయమూర్తి కాకూడదనే (nemo judex in causa sua) సూత్రానికి ఇది విరుద్ధం.** న్యాయం పొందే హక్కు **ఆర్టికల్ 21** లో భాగమని **అనితా కుష్వాహా వర్సెస్ పుష్ప సుదన్ (2016)** లో సుప్రీంకోర్టు ప్రకటించింది. కోర్టుల అధికార పరిధిని సివిల్ ప్రొసీజర్ కోడ్ వంటి చట్టాలు నిర్ణయిస్తాయి; ఒక జీ.ఓ. ద్వారా జిల్లా కోర్టుల పరిధిని తొలగించడం చెల్లదు.

X. అంశాలు 3, 4(డి), 5: బాధ్యత కులాలది, అధికారం మాత్రం సర్కారుది (ఆర్టికల్ 38, 46 స్ఫూర్తికి విరుద్ధం)

- **లోపం:** కరెంటు, నీటి పన్ను, ఆస్తి పన్ను, సెక్యూరిటీ, హౌస్‌కీపింగ్ జీతాలు, సమగ్ర బీమా, ఫైర్ ఎన్ఓసీ, సీఏ ఆడిట్ అన్నీ కమిటీ "సొంత నిధుల" నుంచే. ఒక్క రూపాయి నిర్వహణ గ్రాంటు, కార్పస్ ఫండ్ లేదు. మరోవైపు వాణిజ్య కార్యకలాపాలకు ప్రభుత్వ అనుమతి తప్పనిసరి చేసి ఆదాయ మార్గాలకు తాళం వేశారు. రేపు నిర్వహణ విఫలమైందనే సాకుతో కమిటీలను రద్దు చేయడానికి ఇది పునాది.

- **రాజ్యాంగ ఉల్లంఘన:** బలహీన వర్గాల ఆర్థిక ప్రయోజనాలను ప్రత్యేక శ్రద్ధతో ప్రోత్సహించాలని, సామాజిక అన్యాయం నుంచి రక్షించాలని **ఆర్టికల్ 46**, అసమానతలను తగ్గించాలని **ఆర్టికల్ 38(2)** రాష్ట్రాన్ని ఆదేశిస్తున్నాయి. ఈ జీ.ఓ. దానికి భిన్నంగా పేద బీసీ సమాజాలపై ఆర్థిక భారం మోపుతోంది.

XI. అంశం 6: తనిఖీల పేరుతో నిఘా (ఆర్టికల్ 19, 21)

- **లోపం:** జిల్లా అధికారి ప్రతి నెలా తనిఖీ చేసి "ప్రాంగణంలో జరుగుతున్న కార్యకలాపాలపై" నివేదిక పంపాలి. ఇది భవన భద్రత తనిఖీ కాదు, బీసీ సంఘాలపై నిఘా.
- **రాజ్యాంగ ఉల్లంఘన:** సంఘ కార్యకలాపాలపై నిఘా, సభా, సంఘ స్వాతంత్ర్యాలపై భయం, బెదిరింపు (Intimidating) వాతావరణం కలిగిస్తుంది. గోప్యత ప్రాథమిక హక్కని **కె.ఎస్. పుట్టస్వామి వర్సెస్ భారత ప్రభుత్వం (2017)** లో సుప్రీంకోర్టు తొమ్మిది మంది సభ్యుల ధర్మాసనం ప్రకటించింది.

XII. జీ.ఓ. పేరా 3: పాత ఉత్తర్వుల గుండుగుత్త రద్దు, ప్రభుత్వం మాట తప్పడం (ఆర్టికల్ 14, చట్టబద్ధ నిరీక్షణ, ప్రామిసరీ ఎస్టాపెల్)

- **లోపం:** "గతంలో ఇచ్చిన అన్ని సంబంధిత ఉత్తర్వులు, సూచనలను" రద్దు చేస్తున్నామన్న జీ.ఓ., అవి ఏవో సంఖ్యలవారీగా చెప్పలేదు. జీ.ఓ.ఎంఎస్.నెం.09, 23, 19, 20, 189, ప్రభుత్వ మెమో నెం.3676/D/2021 ఏవీ దాని సూచికల్లో లేవు. ప్రభుత్వ సూచన మేరకే ఉమ్మడి ట్రస్టులు నమోదు చేసుకున్న సమాజాల నుంచి నిర్వహణ బాధ్యతను తీసేసింది. ఆ ట్రస్టుల వాదన విన్నట్లు జీ.ఓ.లో ఎక్కడా లేదు; జీ.ఓ. పంపిణీ జాబితాలో కూడా వారి పేరు లేదు.
- **రాజ్యాంగ ఉల్లంఘన:** చట్టబద్ధ నిరీక్షణను గౌరవించడం **ఆర్టికల్ 14** లోని ఏకపక్షత నిషేధంలో భాగమని **ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వర్సెస్ కామధేను క్యాటిల్ ఫీడ్ ఇండస్ట్రీస్ (1993)** లో, భూకేటాయింపు విధానాన్ని ప్రభావితులకు తెలియజేయకుండా, వారి వాదన వినకుండా మార్చడం తగదని **నవజ్యోతి కో-ఆపరేటివ్ గ్రూప్ హౌసింగ్ సొసైటీ వర్సెస్ భారత ప్రభుత్వం (1992)** లో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రభుత్వ హామీపై నమ్మకంతో ముందుకు వెళ్లినవారి విషయంలో ప్రభుత్వం మాట తప్పరాదని **మోతీలాల్ పదమ్‌పత్ షుగర్ మిల్స్ వర్సెస్ ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం (1979)** తీర్పు చెబుతోంది.

XIII. మొత్తం జీ.ఓ.: ఆత్మగౌరవంతో జీవించే హక్కుకు భంగం (ఆర్టికల్ 21, రాజ్యాంగ ప్రవేశిక)

- ఆత్మగౌరవంతో జీవించే హక్కు **ఆర్టికల్ 21** లో అంతర్భాగమని **ఫ్రాన్సిస్ కొరాలీ ముల్లిస్ వర్సెస్ ఢిల్లీ అడ్మినిస్ట్రేటర్ (1981)** లో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. "వ్యక్తి గౌరవం", "సౌభ్రాతృత్వం" రాజ్యాంగ ప్రవేశికలోని మౌలిక విలువలు. "ఆత్మగౌరవ భవనం" అని పేరు పెట్టి బీసీలను సొంత భవనంలో కాపలాదారులుగా మార్చడం ఆ విలువలను అవమానించడమే.

ఇతర సామాజిక వర్గాల సంఘ భవనాలు తమ ట్రస్టులు, సొసైటీల ద్వారా స్వేచ్ఛగా నిర్వహించుకుంటుంటే, బీసీ కులాల భవనాలకు మాత్రం సర్కారు నిరంకుశ సంరక్షకత్వం విధించడం, ఆధిపత్యం చలాయించడం బీసీలను స్వయంపాలనకు అనర్హులుగా చూడడమే. వారిని అగౌరవ పర్చినట్లే. **ప్రభుత్వం నుంచి భూమి పొందిన ఇతర వర్గాల భవనాలపై ఇలాంటి ఆంక్షలు లేకుండా, కేవలం బీసీ భవనాలపై మాత్రమే విధిస్తే, అది ఆర్టికల్ 14, 15(1) కింద వివక్షగా పరిగణించబడుతుంది.**

5. భూస్వామ్య, అగ్రవర్ణ ఆధిపత్య అహంకార బీసీ వ్యతిరేక జీ.ఓ.

జీ.ఓ. 14, మీ మీ ప్రభుత్వ భూస్వామ్య (ఫ్యూడలీ) మనస్తత్వానికి, బీసీ వ్యతిరేక ధోరణికి నిలువెత్తు నిదర్శనం. దొరల గడీల కాలంలో భూమి దొరలది, శ్రమ, కాపలా, వెట్టి మాత్రం బీసీలది. నేడు ఆత్మగౌరవ భవనాల్లోనూ అదే నమూనా పునరావృతమవుతోంది: నియంత్రణ, అధికారం, నియామకాలు సర్కారువి; కరెంటు బిల్లులు, పన్నులు, జీతాలు, బీమా భారం మాత్రం బీసీలవి.

ఛైర్మన్‌గా మంత్రి, సభ్యులుగా అధికారులు, నోటీసు లేకుండా తొలగింపు, నెలవారీ నిఘా, అనుమతి లేనిదే పామియానా కూడా వేయలేని దుస్థితి. ఇది ప్రజాస్వామ్య పాలన కాదు, జమీందారీ పాలన. దొరల పెత్తనానికి వ్యతిరేకంగా వీర పోరాటం చేసిన చాకలి ఐలమ్మ వారసులను, సర్దార్ సర్వాయి పాపన్న, దొడ్డి కొమురయ్య వారసులను మళ్లీ సర్కారు గడీ ముందు చేతులు కట్టుకుని నిలబడమనడం తెలంగాణ ఆత్మగౌరవ పోరాట చరిత్రను అవమానించడమే.

6. బీసీ స్వయంపాలనకు కనీస రక్షణలు లేని నిరంకుశ జీ.ఓ.

ఈ GO 14 లోని లోపాలు ఒకటి రెండు నిబంధనలను మార్చితే సరిదిద్దగలిగేవి కావు; పూర్తి జీ.ఓ. మౌలిక స్వరూపమే బీసీలకు వ్యతిరేకం. గతంలో కేసీఆర్ గారు అందించిన బిసీ కులాల స్వయంపాలనకు, సాధికారత అంశాలు తుంగలో త్రొక్కబడ్డాయి.

1. **ఎన్నికల ప్రక్రియ లేదు:** నిర్వహణ కమిటీని ఆ కుల సంఘాల సర్వసభ్య సమావేశం ఎన్నుకునే ప్రజాస్వామ్య విధానం లేదు; ఛైర్‌పర్సన్‌ను సభ్యులు కాకుండా మంత్రి నియమిస్తారు.
2. **ఎంపికలో సమాజానికి మెజారిటీ లేదు:** ఎంపిక కమిటీలో కుల సంఘాలకు, బీసీ కమిషన్‌కు, అన్ని పార్టీల బీసీ ప్రజాప్రతినిధులకు స్థానం లేదు; అర్హతలు, నోటిఫికేషన్, పారదర్శక ప్రక్రియ లేవు.
3. **అధికారుల పాత్రకు హద్దు లేదు:** అధికారులు ఓటు హక్కు లేని సలహాదారులుగా కాకుండా, ఓటు హక్కున్న సభ్యులుగా, పైగా "పర్యవేక్షకులుగా" ఉంటారు.
4. **సహజ న్యాయానికి చోటు లేదు:** షోకాజ్ నోటీసు, కనీసం 30 రోజుల వివరణ గడువు, వ్యక్తిగత విచారణ, కారణాలతో కూడిన ఉత్తర్వు, అప్పీలు హక్కు ఏవీ లేవు.
5. **నిర్ణీత పదవీకాలం లేదు:** మూడేళ్ల తర్వాత తప్పనిసరి ఎన్నికలు లేవు; ఛైర్మన్ విచక్షణతో అపరిమిత పొడిగింపునకు అవకాశం ఉంది.

6. **చట్టబద్ధ స్వయంప్రతిపత్తి లేదు:** ఆ కులాల పేరిట రిజిస్టర్డ్ ట్రస్టు లేదా సొసైటీకి, దీర్ఘకాలిక లీజు ద్వారా నిర్వహణ హక్కులు బదలాయించే విధానం లేదు; 2022 లో ఉమ్మడి ట్రస్టులకు అప్పగించిన బాధ్యతను తీసేసి, సమాజానికి మిగిల్చింది కేవలం కాపలాదారు హోదా.
7. **నిర్వహణ గ్రాంటు, కార్పస్ ఫండ్ లేవు:** బీసీ సంక్షేమ బడ్జెట్ నుంచి వార్షిక నిర్వహణ గ్రాంటు, కార్పస్ ఫండ్, విద్యుత్, నీటి ఛార్జీల రాయితీ, ఆస్తి పన్ను మినహాయింపు ఏవీ లేవు.
8. **ఆదాయ స్వేచ్ఛ లేదు:** ఫంక్షన్ హాల్ అద్దెలు, శిక్షణ కార్యక్రమాల వంటి ఆదాయ మార్గాలకూ ప్రభుత్వ అనుమతి కావాలి.
9. **సొంత నిధుల భవనాలకు మినహాయింపు లేదు:** సమాజాలు సొంత నిధులతో కట్టుకున్న భవనాలపై నియంత్రణ భద్రత, అగ్నిమాపక నిబంధనలకు పరిమితం కాలేదు; నెలవారీ ఫోటో నివేదికలు తప్పనిసరి.
10. **నిర్మాణంలో భవన నిర్వహణ కమిటీకి భాగస్వామ్యం లేదు:** డిజైన్, ఏజెన్సీ ఎంపికలో కమిటీకి పాత్ర లేదు; టీజీఈడబ్ల్యూఐడీసీ కి కాలపరిమితి, జాప్యానికి జరిమానా లేవు; 2022 లో ఉన్న సొంత నిర్మాణ అవకాశాన్నే తొలగించారు.
11. **అనుమతులకు గడువు లేదు:** 30 రోజుల గడువు, గడువు దాటితే అనుమతి ఇచ్చినట్లే (deemed approval) అనే నిబంధన లేదు; ద్వంద్వ అనుమతుల విధానం కొనసాగుతోంది.
12. **అస్పష్ట నిషేధాలు:** "చట్టవిరుద్ధ కార్యకలాపాల" నిషేధం సరిపోయేచోట "ప్రభుత్వ వ్యతిరేక" అనే అస్పష్ట పదాన్ని చేర్చారు.
13. **సామాజిక, రాజకీయ చైతన్యానికి చోటు లేదు:** అన్ని పార్టీలకు సమాన అవకాశం అనే నియమంతో బీసీ హక్కులు, రిజర్వేషన్లపై సదస్సులను అనుమతించే వీలున్నా, పూర్తి నిషేధం విధించారు.
14. **కుల సంప్రదాయాలకు గుర్తింపు లేదు:** కులదైవాల పండుగలు, జాతరలు, సాంస్కృతిక ఆరాధనలను "కుల సంప్రదాయం"గా స్పష్టంగా గుర్తించలేదు; బీసీ మహనీయుల జయంతి, వర్ధంతులను అనుమతించినట్లే అనుమతించి, "రాజకీయ", "ప్రభుత్వ వ్యతిరేక" నిషేధాలకు లోబడి జరపాలనడం ద్వారా ఆ వేదికలపై బీసీ హక్కుల గురించి మాట్లాడే స్వేచ్ఛను హరించారు.
15. **బీసీ ఐక్య కార్యక్రమాలకు అవకాశం లేదు:** అన్ని బీసీ కులాల ఉమ్మడి సదస్సులు, ఐక్య వేదికల సమావేశాలను ఏ ఆత్మగౌరవ భవనంలోనూ నిర్వహించుకోలేని పరిస్థితి.
16. **తనిఖీలకు హద్దు లేదు:** మూడు నెలలకు ఒకసారి, భవన స్థితి, భద్రత, ఆర్థిక ఆడిట్‌కు పరిమితమైన తనిఖీలకు బదులు నెలవారీ కార్యకలాపాల నిఘా.
17. **స్వతంత్ర వివాద పరిష్కార వ్యవస్థ లేదు:** విశ్రాంత న్యాయమూర్తి, బీసీ కమిషన్ సభ్యుడు, కులాల సమాఖ్య ప్రతినిధితో ఫిర్యాదుల కమిటీ లేదు; సంబంధిత జిల్లా కోర్టులను ఆశ్రయించే అవకాశం లేదు.
18. **సమ్మిళిత ప్రాతినిధ్యం లేదు:** మహిళలకు కనీసం మూడో వంతు, యువతకు, ఆ కులంలోని అత్యంత వెనుకబడిన ఉపవర్గాలకు, ఉత్తర, దక్షిణ తెలంగాణ జిల్లాలకు ప్రాతినిధ్యం లేదు.
19. **ప్రభుత్వ బాధ్యతలకు గడువు లేదు:** జీ.ఓ.లోని ప్రతి నిబంధన ఆయా కుల ట్రస్ట్ ల పై బాధ్యతలు మోపుతుంది కానీ పెండింగ్ నిధుల విడుదలకు, నిర్మాణంలో ఉన్న భవనాల పూర్తికి కాలపట్టిక లేదు.

20. **సంప్రదింపులు శూన్యం:** ఈ మార్గదర్శకాలు రూపొందించే ముందు ఏ ఒక్క బీసీ కుల సంఘాన్ని, బీసీ కమిషన్‌ను, శాసనసభ్యులను, శాసన మండలి సభ్యులను, బీసీ ప్రజాప్రతినిధులను సంప్రదించలేదు; ముసాయిదా ప్రజల ముందు ఉంచలేదు. ప్రజాస్వామిక అభిప్రాయ సేకరణ జరుపలేదు. 2021 లో నాటి మంత్రి అధ్యక్షతన 41 కులాల సంఘాలతో సమావేశాలు జరిపిన సంప్రదాయాన్నీ విడిచిపెట్టారు.

బీసీలు ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై ఆధారపడే లబ్ధిదారులు కాదు; ఈ రాష్ట్ర సంపదను సృష్టించిన ఉత్పత్తి కులాలు, శ్రమజీవులు, తమ వ్యవహారాలను తామే నిర్వహించుకోగల సమర్థులు. రాజ్యాధికారంలో వాటా ఇవ్వరు, అణచివేస్తుండ్రు, ఆఖరికి ఆత్మగౌరవ భవన నిర్వహణ అధికారానికి పనికిరారా? ఆ చిన్న అధికారాన్ని కూడా ఆధిపత్య నియంతృత్వ ధోరణితో లాక్కుంటారా?

7. కావున, బీసీ శాఖ మంత్రిగా, బీసీ బిడ్డగా మీరు ఈ క్రింది చర్యలు తక్షణమే తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను:

1. ***బీసీ వ్యతిరేక, భూస్వామ్య, రాజ్యాంగ విరుద్ధ జీ.ఓ.ఎంఎస్.నెం.14 ను తక్షణమే పూర్తిగా రద్దు చేయాలి.***
2. ***ఆత్మగౌరవ భవనాల నిర్మాణం, నిర్వహణ బాధ్యతను ఆయా కుల సమాజాల రిజిస్టర్డ్ ట్రస్టులకే అప్పగించిన మూల విధానాన్ని (ప్రభుత్వ మెమో నెం.3676/D/2021, కమిషనర్ మెమోలు తేదీ 21.04.2022, 07.09.2022) సొంత నిర్మాణ ఎంపికతో సహా పునరుద్ధరించాలి.***
3. ***భవిష్యత్తులో ఏ మార్గదర్శకాలైనా అన్ని బీసీ కుల సంఘాలు, బీసీ కమిషన్, అన్ని పార్టీల బీసీ ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సంప్రదింపుల తర్వాతే, పై లోపాలకు తావు లేకుండా రూపొందించాలి.***
4. ***మంజూరైన రూ.95.25 కోట్లలో విడుదలైన మొత్తాన్ని, 41 భవనాల ప్రస్తుత స్థితిని బహిరంగపరిచి, పెండింగ్‌లో ఉన్న భవనాలకు నిధులు విడుదల చేసి, నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేయాలి.*** **ఈ విన్నపాన్ని నిర్లక్ష్యం చేస్తే, బీసీకులాల ఆత్మగౌరవ పరిరక్షణ కోసం ఈ అంశాన్ని శాసన మండలి, శాసన సభలో లేవనెత్తడంతో పాటు, ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడతామని, అవసరమైతే రాజ్యాంగంలోని ఆర్టికల్ 226 కింద గౌరవ తెలంగాణ హైకోర్టును ఆశ్రయిస్తామని సవినయంగా తెలియజేస్తున్నాను.**

ధన్యవాదాలతో, భవదీయుడు,



(డా. దానోజు శ్రవణ్ కుమార్)

ప్రతులు:

1. **గౌరవ ముఖ్యమంత్రి, తెలంగాణ ప్రభుత్వం.**
2. **ముఖ్య కార్యదర్శి, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, తెలంగాణ ప్రభుత్వం.**
3. **కమిషనర్, వెనుకబడిన తరగతుల సంక్షేమం, తెలంగాణ, హైదరాబాద్.**
4. **ఛైర్మన్, తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్, హైదరాబాద్.**